క్లుప్తంగా

21నుంచి గొల్లపేరంటాలమ్మ జాతర



గొల్లపేరంటాల అమ్మవారు

చీపురుపల్లి: నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తుల కల్పవల్లి మెట్టపల్లి గ్రామంలోని గొల్లపేరం టాలమ్మ వారి జాతర ఈనెల 21 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 22, 23, 24 తేదీల్లో నాలుగు రోజుల పాటు జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. జాతరలో తొలిరోజు సీతారామ కల్యాణం, 22న రేలారే రేలా, 23న ఢీ జోడి, శ్రీదేవి డ్రామా కంపెనీ కళాకారుల ప్రదర్శన, 24న సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నామని పేర్కొన్నారు. జాతర విజయవంతానికి గ్రామపెద్దలు సహకరించాలని కోరారు.

బార్ అసోషియేషన్ జాయింట్ సెక్రటరీగా జగదీష్



జె.జగదీష్

గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోషియేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఎలక్షన్ నిర్వహణ అధికారి, సీనియర్ న్యాయవాది రమేష్‌కుమార్ ఆధ్వ ర్యంలో సోమవారం నిర్వహించారు. బార్ అసోషియేషన్ జాయింట్ సెక్రటరీగా న్యాయవాది జెర్రిపోతుల జగదీష్ ఒక్కరే నామినేషన్ వేశారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎలక్షన్ నిర్వహణ అధికారి తెలిపారు. మిగతా అధ్యక్ష, కార్యదర్శులు, తదితర సభ్యుల ఎన్నిక 28వ తేదీన నిర్వహించనున్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గుర్ల: మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు చేశారు. గ్రామమంతా గోవింద నామస్మరణతో మారుమోగింది.

'మేము సిద్ధం.. మాబూత్ సిద్ధం'



ఇంటింట ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొండపల్లి: మండలంలోని వెదురువాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎం.వెంకిరాజు ఆధ్వర్యంలో 'మేము సిద్ధం ..మాబూత్' సిద్ధం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బూత్ కమిటీ సభ్యులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. సర్పంచ్ కె.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరి చిన్నారులకు గాయాలు

శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న వీధిలో నివసిస్తున్న హృషికేశ్, నేహాపై సోమవారం పిచ్చికుక్కదాడిచేసింది. స్కూల్‌కు వెళ్లేసమయంలో ఇద్దరినీ గాయపరిచింది. వీరిలో నేహాకు డాక్టరైన తల్లి వైద్యం చేయగా, హృషికేష్‌ను ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. గాయం కడిగేందుకు అక్కడ నీరు రాకపోవడంతో చిన్నారి తండ్రి రామకృష్ణ వైద్యులను నిలదీశారు. ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసి ఆస్పత్రులకు సదుపాయాలు కలిస్తుండగా, సరిగా నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. ఇదే కొనసాగితే సేవల తీరుపై న్యాయపోరాటం చేస్తానన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: గంట్యాడ మండలంలోని లక్కిడాం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. లక్కిడాం గ్రామంలో జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పని కల్పించాలని ఎంపీడీఓ, డ్వామా అధికారులను పలుమార్లు కోరినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్.దుర్గమ్మ, ఎల్.లలిత, బి.సుశీల, బి.మరియమ్మ, బంగారమ్మ, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం



మెట్టపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇచ్చారని, ప్రజలంతా జగన్‌ను ఆశీర్వదించాలని విజయనగరం పార్లమెంటు అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ కోరారు. మండలంలోని అలజంగి, మెట్టపల్లి, పత్తికాయవలస గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ, పార్లమెంటు అభ్యర్థిగా తనని వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఎంపిక చేసిందని, మీరంతా ఓటు వేసి మద్దతు ఇవ్వా లని ప్రజలను కోరారు. పార్టీలు, కుల,మతాలకు అతీతంగా ప్రతీ ఇంటిలో అర్హులకు సీఎం జగన్ పథకాలు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయే విధంగా మంత్రి బొత్స సత్యనారాయణ హయాంలో అభివృద్ధి జరిగిందన్నారు. ఓ వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం సమపాళ్లలో చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మీసాల వరహాలనాయుడు, దన్నాన జనార్దనరావు, రఘుమండ త్రినాథ్, చందక గురునాయుడు, మీసాల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే మా విధానం



పెదఖండేపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ప్రజాసంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విధానమని, జగన్ నాయకత్వాన్ని సమర్థించి, ఆయన్ని మళ్లీ సీఎం చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ సందర్శన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు గ్రామస్తులు మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వినాయకుడి కోవెల వద్ద గ్రామస్తులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ జనం కోసం రాజకీయాలు చేసే వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. త్వరలో రాష్ట్రంలో జరిగే ఎన్నికలు పెత్తందారీ వ్యవస్థకు, పేదలకు మధ్య అని చెప్పారు. ప్రజానేత జగనన్నను అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అంతా ఏకోన్ముఖంగా పనిచేయాలని కోరారు. జగనన్నను పడగొట్టేందుకు టీడీపీ, జనసేన,బీజేపీ కూటమిగా మారి కుటిలప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. అధికారం కోసం ఎంత దిగజారుడు తనానికైనా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వెనుకాడడని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీని నాడు తిట్టిన వారే నేడు ఆయన చుట్టూ ప్రదక్షి ణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రాజకీయాలను నిశితంగా గమనించి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం జగన్ ప్రజలంతా ఆశీర్వదించి, ఆయన్ని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మాజీఎమ్మెల్యే హైమావతి, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, సర్పంచ్‌లు కె.వెంకటరావు, మంచిన శివరామకోటి, జుత్తాడ సూర్యారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి వి.సతీష్, నాయకులు మమ్ములూరి సోంబాబు, గోకాడ శ్రీను, మోదీ కాశీవిశ్వనాథం, జి.పైడితల్లి, బుగత వెంకటేశ్వరావు, మజ్జి శేఖర్, చింతల నారాయణ మూర్తి, ఎలమంచిలి అప్పారావు, పెదఖండేపల్లి గ్రామ పెద్దలు రంభ రమణ, చిన్నా మాస్టర్, ఎరపతినేని సూర్యనారాయణ, ఎం.అప్పారావు, వారాది నారాయణరా వు, యువత వై.గణేష్, తాతబాబు తదితరులు హాజరయ్యారు.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు ప్రారంభం

పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థుల కోసం పరీక్ష కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి, మాస్ కాపీయింగ్ జరగకుండా చూశారు. కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎంఈఓలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. తొలిరోజు పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసింది. – సాక్షి నెట్‌వర్క్



ఎల్.కోట హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కొత్తవలస హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఎల్.కోట మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



ఎస్.కోట బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



వేపాడ హైస్కూల్ పరీక్ష కేంద్రంలోకి క్యూలో వెళుతున్న విద్యార్థినులు



మెరకముడిదాం మండలం గర్భాం ఉన్నత పాఠశాలలో రూమ్ నెంబర్లను వెతుక్కుంటున్న విద్యార్థులు



గరివిడి మండలం కోనూరు పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



కొత్తవలస హైస్కూల్ పరీక్ష కేంద్రానికి దివ్యాంగ విద్యార్థి నరేంద్రను ఎత్తుకొని తీసుకువస్తున్న తన సోదరుడు

పాఠశాల సందర్శన



విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, టీచర్ల లెసెన్ ప్లాన్ పరిశీలించారు. విద్యార్థుల దస్తూరీ మెరుగుపరిచేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మరుగుదొడ్ల నిర్వహణను, మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించారు.

విద్యావంతులు, అనుభవం ఉన్నవారికే సీట్లు

చీపురుపల్లి/ఎస్.కోట/దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ అధిష్టానం త్వరలో జరగనున్న ఎన్నికల్లో విద్యావంతులు, రాజకీయ అనుభవం ఉన్నవారికే సీట్లు కేటాయించింది. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకుంది. ప్రచారాలు ప్రారంభించిన వేళ.. అభ్యర్థుల బయోడేటాలను ఓ సారి పరిశీలిద్దాం.

గజపతినగరం నియోజకవర్గం



బొత్స అప్పలనరసయ్య

పేరు: బొత్స అప్పలనర్సయ్య, తండ్రి లేటు గురునాయుడు
విద్యార్హత: ఇంజినీరింగ్, 2000లో డీఈ ఉద్యోగానికి రాజీనామా
భార్య: అనూరాధ, ఎంఏ, ఎంఎల్
కుమారుడు: సాయి గురునాయుడు, ఎంబీఏ (యూఎస్‌లో చదివారు)
కుమార్తె: యామిని సింధు, ఎంసీఏ (ఆస్ట్రేలియా)
అలవాట్లు: షటిల్ ఆడటం
వచ్చిన భాషలు: తెలుగు, ఇంగ్లిష్, హిందీ
రాజకీయ నేపథ్యం:
- 2001 కాంగ్రెస్ పార్టీ తరపున బొండపల్లి జెడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు.
- 2006లో దత్తిరాజేరు జెడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు.
- 2009లో గజపతినగరం ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు.
- 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి టీడీపీ అభ్యర్థి కేఏ నాయుడు చేతిలో ఓటమి
- 2019 వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపు

చీపురుపల్లి నియోజకవర్గం



బొత్స సత్యనారాయణ

పేరు: బొత్స సత్యనారాయణ
తండ్రి పేరు: లేటు బొత్స గురునాయుడు
భార్య పేరు: బొత్స ఝాన్సీలక్ష్మి
ప్రస్తుత హోదా: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి
విద్యార్హతలు: బీఏ
జననం: 09-07-1958
కుటుంబ వివరాలు: బొత్స ఝాన్సీలక్ష్మి(భార్య), డా.సందీప్(కుమారుడు), అనూష(కుమార్తె)
రాజకీయ నేపథ్యం: 1999లో ఎంపీ (బొబ్బిలి పార్లమెంట్)
2004 ఎమ్మెల్యే, చీపురుపల్లి
2009 ఎమ్మెల్యే, చీపురుపల్లి
2019 ఎమ్మెల్యే, చీపురుపల్లి
2010లో పీసీసీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్
మంత్రి పదవులు: రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి, రాష్ట్ర హౌసింగ్ శాఖా మంత్రి, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి
అభివృద్ధి పనులు: ఇందిరమ్మ సుజలధార తాగునీటి పథకం, ఇంటింటి కుళాయిలు, టీటీడీ కల్యాణ మంటపం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్‌డివిజన్, సెంటర్ లైటింగ్, అన్ని గ్రామాలకు బీటీ రహదారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, బ్లడ్‌బ్యాంక్, ప్రభుత్వ కళాశాలలు, బాలుర, బాలికల వసతి గృహాల ఏర్పాటు.

శృంగవరపుకోట నియోజకవర్గం



కడుబండి శ్రీనివాసరావు

పేరు: కడుబండి శ్రీనివాసరావు.
వయస్సు: 56
విద్యార్హత: బీటెక్ (ఈసీఈ, జేఎన్‌టీయూ, కాకినాడ) ఎం.టెక్ (కంప్యూటర్ సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్)
ఇంటర్మీడియట్: మహారాజా కళాశాల, విజయనగరం
స్కూల్: జిల్లా పరిషత్ హైస్కూల్, మరడాం
తండ్రి: కడుబండి రామునాయుడు
తల్లి: కడుబండి సింహాచలం
భార్య: డాక్టర్ మధు (అంకాలజిస్ట్, యూఎస్ఏ)
కుమార్తె: అనీషా (ప్రీ మెడికల్ యూనివర్సిటీ ఆఫ్ అబ్రాస్కా)
కుమారుడు: నీరజ్ (ప్రీ మెడికల్ యూనివర్సిటీ ఆఫ్ జాన్ హాప్‌కిన్స్)
వృత్తి: సాఫ్ట్‌వేర్ బిజినెస్ (25 ఏళ్ల మల్టీనేషనల్ కంపెనీలకు పనిచేశారు)

రాజకీయ అనుభవం..
2014లో ఎమ్మెల్యే ఎన్నికల్లో గజపతినగరం నుంచి పోటీ చేశారు.
2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్.కోట నుంచి గెలుపు.

మలేరియా నివారణ కార్యక్రమాలు చేపట్టాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మలేరియా నివారణకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్స్(మేల్)కు రెండురోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయితో పర్యటించి జ్వర పీడితుల రక్తపూతలను సేకరించాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు, జిల్లా మలేరియా అధికారి వై.మణి, డి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడుబండికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కడుబండిని సత్కరించి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రయాణికులు

కొత్తవలస: ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సిఫార్స్ మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గాజువాక సమీపంలోని స్టీల్ ప్లాంట్ మెయిన్ గేటు వరకు 55 ఎం/కె నంబర్ బస్సు సర్వీసును అధికారులు ఇటీవల ప్రారంభించారు. ఈప్రాంతం నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు నిత్యం పదుల సంఖ్యలో ఉపాధి నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. నేరుగా అక్కడికి వెళ్లేందుకు బస్సు లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్త బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేసారు. దీంతో పలువురు ప్రయాణికులు ఎమ్మెల్యేను స్థానిక క్యాంపు ఆఫీస్‌లో సోమవారం కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

• సెల్ఫీ అభిమానం



కనకమహాలక్ష్మి ఆలయం వద్ద మంత్రి బొత్సతో సెల్ఫీ తీసుకుంటున్న యువకుడు

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఉన్న అభిమానం యువత, మహిళల్లో స్పష్టంగా కనిపిస్తోంది. చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం కుటుంబ సమేతంగా వచ్చారు.అమ్మవారి దర్శనం చేసుకుని వస్తున్న సమయంలో మంత్రి బొత్సతో సెల్ఫీలు దిగేందుకు యువత, మహిళలు పోటీపడ్డారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు మంత్రి బొత్సతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపించారు. మంత్రి బొత్స సైతం ఓపిగ్గా సెల్ఫీలు దిగారు.

ముగిసిన జామి ఎల్లారమ్మ జాతర



పూజలందుకుంటున్న జామి ఎల్లారమ్మ



జామిలో అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



భీమసింగిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జామి: మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహించిన ఎల్లారమ్మతల్లి జాతర సోమవారంతో ముగిసింది. చివరి రోజు కూడా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరను విజయవంతం చేసిన పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, వైద్యశాఖల అధికారులు, భక్తు లకు దేవదాయశాఖ అధికారులు,ఆలయ కమిటీ సభ్యులు,సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఉపసర్పంచ్ అల్లు పద్మ, పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

భీమసింగిలో ఎల్లారమ్మ జాతర

మండలంలోని భీమసింగిలో ఎల్లారమ్మ జాతరను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏటా జామి ఎల్లారమ్మ జాతర చివరిరోజున ఈ గ్రామంలో తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం వేకువ జాము నుంచే భీమసింగితో పాటు చిల్లపాలెం,యాతపాలెం,సోమయాజులపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, రవికలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.